# ఇదీ కథ

మీరు రచయితని మన్నించి వరకట్నాన్ని శాసన కర్తగా నిషేధించమంటే నాకు నా కథే గుర్తుకు వస్తూ వుంది.

నేను మా అత్తా మామల్ని పెళ్ళప్పుడు లంచం అడగలేదు.

అయితే మాకేం అని మీరు అడగవచ్చు. కానీ —

నాకు పది మంది కొడుకులు. పది మంది కూతుళ్ళు.

వాళ్ళందరికి రెండేళ్ళలో పెళ్ళిళ్ళు ముగించాలి.

నేను కట్నం తీసుకోలేదు. కాబట్టి కొడుకులకు తీసికోవటం, కూతుళ్ళకు ఇవ్వటం నా కిష్టం లేదు.

ఇష్టంలేక పోవటానికి మరొక అండ కూడా వుంది.

అది డబ్బు లేకపోవటం.

కొడుకులకు తీసుకుంటే కూతుళ్ళకు ఇవ్వవచ్చునని ఒక మిత్రుడు సలహా యివ్వకపోలేదు.

మొండివాడి కంటే బలవంతుడు లేడు. నేను బలవంతుణ్ణి.

నన్నొక పట్టాన మిత్రు లెవరూ ఒప్పించలేరు, నొప్పించలేరు.

కొడుకులతో మీరు నాలాగ పెళ్ళిళ్ళు చేసుకోండి అని చెబుతాను. వాళ్ళు నా మాట వింటారు. బంగారు కొండలు. కూతుళ్ళతో చెప్పాలంటేనే చిక్కు.

మీ అమ్మకు పెళ్ళి జరిగినట్లే మీ పెళ్ళిళ్ళు జరగాలని కోరుతున్నాను అంటాను. వాళ్ళు వింటారు.

వాళ్ళు వినటం కంటే ఏమి చెయ్యలేరు. బంగారు కొండలు.

పుత్రులు నా మాట ధిక్కరించి కట్నం పుచ్చుకుంటే నేను చెయ్యగలిగింది ఏమీలేదు.

పుత్రికలు నా మాట ధిక్కరించి కట్నం ఇవ్వాలని తీర్మానించుకుంటే, నా దగ్గర చిల్లి గవ్వ లేదు.

కొడుకులైనా, కూతుళ్ళయినా వాళ్ళ అభిప్రాయాలను నేను మన్నిస్తాను.

వాళ్ళ అభిప్రాయాలను మన్నిస్తే నా పర్సు బరువు చూసుకోవలసి వస్తుంది.

అందువల్ల స్వతంత్రంగా ఆలోచించే వాళ్ళ అభిప్రాయాలు నేను తిరస్కరించవలసి వస్తుంది. స్వతంత్రతకు తిరస్కారం.

వాళ్ళకు వాళ్ళ అభిప్రాయాలయినా ఉన్నాయి. అభిప్రాయాలే లేని పసి వాళ్ళు లోకంలోని సుగంధాన్ని పీల్చకుండా, ప్రతి ప్రాణి సహజవాంఛ అయినా సంతాన ప్రాప్తి పొందకుండా ముసలివాళ్ళు అయిపోవటం భరించరానిదిగా అనిపించింది.

తల్లి చాటు బిడ్డలు, తండ్రి చాటు బిడ్డలు, తల్లిదండ్రుల చాటు వృద్ధులుగా అంతరించిపోవటం కష్టంగా అన్పించింది.

వరుల్ని కొనుక్కురాగలిగే వాళ్ళు సంతకు పోయి కొనుక్కు వస్తారు. కొనలేని వాళ్ళు ఎలాగో కొట్టుకు పోతారు.

కానీ మూతి మీద మీసం ఉన్నందుకు నిదర్శనంగా పిల్లల్ని కని, పిల్లలకు పెళ్ళి చేయటానికి పొలం పుట్రా, నగా నట్రా, ఇల్లూ-వాకిలీ, వళ్ళూ గిళ్ళూవల్లకాడు చేసుకొని, పిల్లకాటికి కాళ్ళు చాపి, శవాల కంటే హీనంగా, దీనంగా, మ్లానంగా తిండి లేక, బట్టలేక, ఇల్లులేక, దిక్కు లేని చావు చస్తున్న తల్లిదండ్రుల్ని తలుచుకొంటుంటే కడుపులో పేగులు తరుక్కుపోతున్నాయి.

మరి కొంత మంది తల్లిదండ్రులు కొడుకులతో, బ్రతుకులతో వ్యాపారం చేస్తున్నారు.

కొవ్విన పొట్టేలు రేటుగా బాగా పలికినట్లు, కొడుకుల్ని డిగ్రీలతో, ఉద్యోగాలతో కొవ్వు ఎక్కనిచ్చి రేట్లు వేలం పాటపాడుతున్నారు.

మంచి బేరం చూచి అమ్ముతున్నారు.

ఈ తల్లిదండ్రుల్ని చూశారూ! మరీ చిత్రమయినవాళ్ళు వీళ్ళు. కూతుళ్ళను ప్రోత్సహిస్తారు. ఏమనీ ? ప్రేమించమని! ఎవరిని ? యోగ్యుణ్ణి ! ఎలాంటివాడు ? ఆస్తిపాస్తులున్న తండ్రికి ఒక్కగా నొక్క కొడుకు. ఇదీ వరుస.

అటువంటి పెళ్ళిళ్ళు కొన్ని జరిగినా ఎవరూ నిజంగా తృప్తిపడుతున్నట్లు కనిపించటం లేదు.

రచయితగా వరకట్నం నిషేధిస్తూ ఇటువంటి కథ చెప్పాలనుకుంటున్నాను.

కొత్త కాలనీ, పక్క పక్కనే ఇళ్ళు.

ఆ ఇంట్లో ఒక యువతి. ఈ ఇంట్లో ఒక యువకుడు. చూపులు కిటికీల్లోంచి, చెట్ల మధ్య నుంచి దాటిపోయి, నిటారుగా ఎదురెదురుగా నిలబడి చూసుకోవటం దాకా వచ్చాయి.

మాటలు కూడా మొదలయ్యాయి. మాటలు నవ్వులవుతున్నాయి.

మొదట్లో నెమ్మదిగా తర్వాత పకపకా వినబడుతున్నాయి. నవ్వులు.

తల్లులూ, తండ్రులూ చూశారు.

అసలు మెలిక ఇక్కడే ఉంది ఎవ్వరు ఎవర్ని తిట్టలేదు. కొట్టలేదు. ఇల్లొదిలి పొమ్మనలేదు. నా ఆస్తి నీకు లేదనలేదు. నా గడప ఈ గడప తొక్కొద్దనలేదు.

వాళ్ళలో ఒక్కళ్ళిద్దరు నవ్వారు. ఒకరు బాగానే ఉంది వరుస అన్నారు.

యువతీయువకులిద్దరు కలసి మెలసి తిరుగుతున్నారు. ఇక పార్కులు, సినిమాలు.

పిల్ల తండ్రి అనుకున్నాడు.

ఒక్కడే కొడుకు. బంగారం లాంటి ఇల్లు- తండ్రి ముసలివాడు. ఎప్పుడో ఒక సారి హరీ అనో, శివా అనో అంటాడు. ఆ తరువాత ఆస్తి అంతా అల్లుడిదే! అంటే కూతురుదే! రెండిళ్ళ మధ్యా ఉన్న కాంపౌండు గోడ పడగొడితే ఆస్తంతా అఖండం! ఒక్కటే.

పిల్లవాడి తండ్రి దాదాపు ఇలాగే అనుకున్నాడు. వాడి మామది మంచి ఔదార్యం. బాగా సంపాదిస్తున్నాడు ఆస్తి అంతా కొడుకుదే. రెండాస్తులకు యజమాని.

తండ్రులిద్దరు పెళ్ళిమాట మాట్లాడు కోవటం రెండు నిముషాలపని!

ఒప్పందాలు కుదిరినాయి. కట్నంప్రసక్తిలేదు.

ఇట్లాంటి కథ చెబుదామా వరకట్నం లేదు అనటానికి అనుకున్నాను. నా మీద నాకే కోపం వస్తూఉంది.

ఇది నిజంగా కట్నంలేని పెళ్ళా? డబ్బుమీద వ్యామోహం లేని పెళ్ళా?

ఒకందుకు మెరుగు. అటుగానీ ఇటుగానీ ఎవరూ ఏడ్చే పనిలేదు.

కానీ ఇటువంటి కథకు ముగింపు ఏమిటి? స్వేచ్ఛగా తిరుగుతున్న అమ్మాయి, అబ్బాయి. తల్లిదండ్రులకు చెప్పకుండా ఎక్కడో పెళ్ళిచేసుకొని ఎక్కడో స్థిరపడి ఇల్లు కట్టించుకొని, ఆ ఇంట్లోచేరి ముసలి జంటలకు రెండు వాటాలు చూపిస్తే ఆ రెండిళ్ళ అడ్డుగోడ పడగొట్టి అఖండం చేయాలనుకున్న తల్లి దండ్రుల ఆలోచనలు ఎలా ఉంటాయి?

ఆ ప్రశ్నే మంచి ముగింపు కావచ్చు. అయితే ఇలాజరిగే పెళ్ళిళ్లు ఎన్ని? ఇందులోని ప్రయోజనం ఏమిటి? ఇది ఏ వర్గం ఇష్టం తీర్చినట్లు అవుతుంది. నేను ఎవరికోసం ఎవరి జీవితం చిత్రిస్తున్నాను. ఈ ప్రశ్నలు ఆలోచనలై ఈ కథ చెప్పనీయటం లేదు.

రోజూ పత్రికల్లో ఎన్ని వార్తలు. కట్నం తేలేదని కోడల్ని వెళ్ళగొట్టడం-తిట్టడం-కొట్టడం-చంపటం.

క్రూరంగా చంపటం, హింసించి చంపటం. వ్యభిచరించి చంపటం.

ఉరితీయటం, కిరసనాయులు పోసి అంటించడం. చంపి తగల బెట్టడం.

తలచుకొంటే వళ్ళు మండుతుంది. ఆర్పడానికి కన్నీళ్ళే ఫైర్ ఇంజన్లు.

వీళ్ళ చేతుల్లో ఎన్ని ప్రాణాలు బలిఅవుతాయి. ఎంత యౌవ్వనం గంగ పాలవు తుంది. ఎంత సౌందర్యం మండి మసి అవుతుంది.

చాలా సందర్భాలలో భార్యకు జరుగుతున్న కష్టం భర్తకు తెలియదు. నూరేళ్ళ భాగస్వామిని సంవత్సరంలో పోగొట్టుకొని ఎంతగా కుమిలి పోతాడో యువకుడు.

యువకుల్ని చూస్తుంటే కుమిలి కుమిలి ఏడవబోతున్న భవిష్యత్ భర్తలు కనిపించి దుఃఖం ముంచుకు వచ్చింది.

యువతులు కనిపిస్తే భవిష్యత్తులో బూడిద కాబోతున్న ప్రాణులు అనిపించింది.

లోకంలో కనిపించే యువతీ యువకులు స్వొంత వాళ్ళుగా అన్పించసాగారు.

వీళ్ళంతా తమ్ముళ్ళు, చెల్లెళ్ళుగా, కూతుళ్లగా, కొడుకులుగా, మనుమళ్ళు, మనుమరాళ్ళుగా కనిపించి, అనిపించి గుండె పొంగి, కుంగి, రేగి, ఉరవళ్ళెత్తి, పరవళ్ళెత్తి నాకు ఆరోగ్యం లేకుండా చేస్తూనే వుంది.

ఈ దేశం నాకెంత స్వొంతదీ, నాకెంత కావలసిందీ!

ఈ చావుల్ని నేనేమయినా అరికట్టగలనా? నాకేమయినా శక్తివుందా? రచయిత మేల్కొంటున్నాడు.

నేనిప్పుడే కథ మీకు చెప్పితీరాలి. లేకపోతే నాకు విశ్రాంతి లేదు.

అమ్మాయి అందగత్తె. మెరుపుతీగె. పేరు సుధ. ఆమె అమృతం దాల్చిన ఆకారం,

అబ్బాయి బాగున్నాడు. రవి.

ప్రేమించు కున్నారు.

పెళ్ళాడుదామని నిర్ణయించు కున్నారు.

సమస్య డబ్బు కదా!

అబ్బాయి డబ్బున్నవాడు, అమ్మాయి పేదది.

పెళ్ళికి డబ్బు అడ్డంకాదా! అవును.

అందుకే పెళ్ళి సజావుగా జరగలేదు.

రిజిష్టర్ ఆఫీసులో తతంగం ముగిసింది.

రవి, సుధను ఇంటికి తీసుకవోయిన రోజున.

'అమ్మాయి అందంగావుంది' అంది తల్లి.

మామ ఎగాదిగా చూశాడు. బావ కట్నం ఎంత అన్నట్లు చూస్తే,

'ఇప్పుడేమీ ఇవ్వలేదు. తర్వాత ఇస్తారు' అన్నాడు రవి.

'ఎప్పుడిస్తాడు మీ నాయన కట్నం' అని అందరూ అడగటం, ఎత్తి పొడవటం, ఎగతాళి చేయటం శ్రుతి మించింది.

ఒకసారి పెళ్ళిలో నలుగిరి ఎదుట అవమానం ఎదురయ్యింది.

అత్త ఛీదరించుకోసాగింది.

మామ సణుగుతున్నాడు.

బావ వంకరగా చూస్తున్నాడు.

రవి ఇంట్లో వుంటే సుధక్కు భయం లేదు. కానీ అతను లేకపోతే వణికిస్తుంది.

బావ రేప్ చేసి, గొంతు పిసికి చంపుతాడని దిగులు.

మామ పలుపూ, పగ్గం తెస్తే దూలానికి ఉరి తీయటానికే అనుకొంది.

ఇంటి ముందు బండి కట్టెలు రాసి పోస్తే తనను తగులపెట్టడానికే అనుకొంది.

కిరసనాయిలు టిన్ను తెస్తే ఆ రాత్రి నిద్రపోలేదు.

తాను తగులబడుతూ, అరుస్తూ, వీధిలో పరుగెడుతున్న దృశ్యం కనిపించింది.

తన భయాన్ని భర్తతో చెప్పింది.

'ఏం ఫర్వాలేదు. అమ్మ, నాన్న అందరూ మంచి వాళ్ళు. నీ అందం వాళ్ళను జయించింది. నీ అణుకువ వాళ్ళకు నచ్చింది. నీకేం చింతలేదు. ఏదో ఒక రోజున వాళ్ళకేం ఆస్తి లేదు. ఏమీ ఈయలేరు అని నేనే తెల్చి చెబుతాను!' అని నచ్చ చెప్పాడు.

అయినా సుధకు నిద్ర పట్టటం లేదు.

అందువల్ల మంచం పట్టింది.

ఇప్పుడు సుధ అందగత్తె అని ఎవరూ అనరు. అన్నా వినరు. విన్నా ఒప్పుకోరు.

భయం మనిషి రూపం మార్చేసింది.

అందం హత్య చేయబడింది.

తల్లీదండ్రీ ఏడ్చారు.

అయినా ఆ యింటిలో వాతావరణం గమనించారు.

సుధ ఆరోగ్యం కోసం ఆ యిల్లు అల్లాడిపోవటం చూశారు. భయం లేదని చెప్పారు.

అయినా సుధ భయం సుధకుంది.

ఇట్లా అయితే ఈ కథ ముగిసేట్లు లేదు.

ఏదో విధంగా ముగింపు చెప్పాలి.

పట్టణంలో రవికి ఉద్యోగం వచ్చి, పల్లె వదిలి వెంట సుధను తీసుకుపోవాలని అంటున్నప్పుడు అంత జ్వరంలోనూ, సుధ ఎగిరి గంతేసి, రవి మెడ వాటేసుకొని సినిమా హీరోయిన్‌లా నవ్వించదని కథ ముగించవచ్చని అనుకొంటుంటే నాకు వళ్ళు చురచురలాడడం మొదలుపెట్టింది.

నా కథలో నేను నా యిష్టం వచ్చినట్లు సుధకు కట్నం లేకుండా పెళ్ళి చేశాను.

బాగానే వుంది.

అయితే అందం ఎర చూపించాను.

మరి అందం లేని చెల్లెళ్ళ కథ ఏమిటని? పెళ్ళి పెటాకులూ లేకుండా పోవాలా ?

సుధకు పెళ్ళయితే మాత్రం ఏం సుఖపడింది?

భయంతో సగం చావు చావనే చచ్చింది.

ఆమె సౌందర్యం నశించింది.

ఈ పితలాటకాలులేని పెళ్ళి జరగాలంటే యువకులు ధైర్యవంతులు కావాలి.

రవి ధైర్యవంతుడే, కానీ 'కట్నం తీసుకోను' అన లేని పిరికివాడు. అధైర్యవంతుడు.

ఈ మాత్రం ధైర్యం లేనివాళ్ళు ఎంత మంది యువకుల్లేరు.

తల్లి దండ్రులు, వంశం, కులం, మతం, అంతస్తు, ఐశ్వర్యం గీసిన గీతల్లో బందీలు ఎందరులేరు ?

ధైర్యం లేని యువకుణ్ణి కట్టుకొన్న యువతి నరకం అనుభవిస్తుంది.

యువకుడి మీద ప్రేమ, వాడి పిరికితనం మీద దిగులు, ఉంటే యువతి బ్రతుకు ఏమౌతుంది ?

జానకి కథ అవుతుంది. నాలోని రచయిత వెలుపలికి వస్తున్నాడు.

ఈ కథంతా నాలుగు ముక్కలే కదా !

మాంసం ముక్కలు తక్కువయినప్పుడు మా యింట్లో మసాల ఎక్కువ నూరుతారు. మాంసం కూర రుచిగానూ ఉంటుంది.

కథ తక్కువైతే మసాలా నూరటం, కూరటం నాకూ తెలుసు.

మీకు కథల మీద ఆసక్తి ఎక్కువ కదా ?

నాకు మసాళా సాహిత్యం కూడా వడ్డించటం తెలుసు.

నేను అభినవ సాహితీ భీముణ్ణి, నలుణ్ణి !

పాకం బాగుంటుంది.

ఎంత బాగున్నా గుండె కలకగా ఉంది. జానకి కథ తలచుకొంటుంటే.

జానకిని రాముడూ ప్రేమించాడు. కృష్ణుడూ ప్రేమించాడు.

రాముడు బీదవాడు.

కృష్ణుడు ధనవంతుడు. పొగాకు కంపెనీ ఓనరు.

బీదతనం బీదతనాన్ని వరించింది. సీతారాముల ప్రేమ తల్లితండ్రులు విన్నారు.

కట్నం లేందే వీలు లేదన్నారు.

రాముడు తండ్రి మాట జవదాటడు.

కృష్ణుడి ప్రేమ కామం, మోసం, దాహం.

జానకి పక్కలోకి కావాలి. భార్యగా వద్దు

రాముడికీ, జానకి కావాలి, కట్నమూ కావాలి.

జానకి ఇంట్లో ఆ రోజుకు తిండిలేదు.

ఈ ముక్కోణపు ప్రేమలు, పెళ్ళిళ్ళు, విరహాలు, తాపాలు, పాపాలు, త్యాగాలు, కన్నీళ్ళూ మీకు బాగా తెలుసు. నేను కొత్తగా మీకు చెప్పవలసింది ఏమీ లేదు.

చేతయినా ఇందులో నేనేమీ మసాలా నూరదలచలేదు. కూరదలచలేదు.

ఉన్న మాట ముక్కుసూటిగా చెప్పి కథ ముగిస్తున్నాను.

జానకి, కృష్ణుడి కోర్కె తీర్చింది. డబ్బు తీసుకుంది.

రాముడి కోర్కె తీర్చింది. కట్నం ఇచ్చింది.

పెళ్ళయింది ఆమె సంసారం సుఖంగావుంది. అని అనాలంటే తలకాయలో సూదులతో పొడిచినట్లుంది.

ఆమె సంసారం సుఖంగా ఉంటుందా? ఉంటుందని అన్నప్పటికీ, ఆమె ఏమీ ఎరగనట్లు ఉండగలుగుతుందా ?

నాకు ఇంకొక సందేహం—

ఈ యువకుల చేతకానితనం మీద నాకు కసి ఉందా? ఈ వ్యవస్థ మీద ద్వేషం ఉందా? ఈ విధానం మీద పగ ఉందా ?

రచయితకు కసి, ద్వేషం, పగ ఉండవచ్చునా ?

నాలో ఉడికి పోతున్న రచయిత కఠినంగా నిషేధ శాసనం చేస్తున్నాడు.

నా గుండెలో వణుకు ప్రారంభమయింది.

వరకట్నం నాకు ధనాశ అనిపించింది. మానసిక వ్యాధి అనిపించింది. దోపిడీ అనిపించింది. ఆశపోతుతనం కూడా అనుకొన్నాను. జబ్బు, పీడ, పిచ్చితనం, వెధవాయిత్వం అనుకొన్నాను. కానీ తీరుబడిగా ఆలోచిస్తే పేదరికం పెల్లుబికిన, పేట్రేగిన, తగలబడుతున్న దేశంలో ఇది ఆర్థిక విధానం మీద ప్రశ్నగా సమస్యగా అనిపించింది.

భార్యగా వచ్చే మనిషి జీవితం పొడుగునా తినటానికి తెచ్చుకొనే గింజలు కట్నం డబ్బులు.

మరి ఒకనాటి కన్యాశుల్కం జీవితాంతం ఇంటి పనీ, వంట పనీ చేయటానికి పని మనిషిని కొనుక్కోవటం.

దాంపత్య ధర్మం మహోత్కృష్టం; వేదవేదాంగాలు ఈ సత్యం ఘోషిస్తున్నాయి. ఏ ధర్మం అయినా నాశనం కావచ్చు, 'దాంపత్య ధర్మం ఈ గడ్డ మీద మట్టి గొట్టుకు పోదు' అని పొంగిపోయే, పొగరుకు పోయే, మనం కొనటం, అమ్మటం దాటలేమా ?

ఆర్థికంగా బాగుపడితే దాటవచ్చు.

ఎప్పుడా బాగు పడటం?

అందాకా స్త్రీ ఆర్థికంగా స్థిరపడితే కట్నం గోల తప్పవచ్చు.

ఆస్తి పాస్తులులేని ఆడపిల్లలు ఏదైనా పనిచేయగలిగేవాళ్ళు కావాలి. స్వశక్తిమీద బ్రతుక గలిగే వాళ్ళు కావాలి.

చదివినా, చదవకున్నా ఏదో ధర్మమైన సంపాదన చేయగల వాళ్ళుగా ఆడపిల్లలు పెరగాలి. మనం పెంచాలి.

దేశం నిండా కనిపించే చెల్లెళ్ళనూ, కూతుళ్ళనూ, మనుమ రాళ్ళనూ, ధనవంతులు కమ్మని ఆశీర్వదిస్తున్నాను.

నాగుండె నింతగా దండించిన మీకు నేనేం చెప్పేది, శుభం తప్ప, నా గుండె నింతగా దండించిన పండించిన మీకు శుభం.

సి. పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం
గ్రంథ వరుస సంఖ్య 5985
తేది